మాకొద్దీ టమాటా..!


సీతమ్మధార రైతుబజారులో విక్రయిస్తున్న నాసిరకం టమాటా


రైతుబజారులో సబ్సిడీ టమాటాల కోసం బారులు తీరిన వినియోగదారులు

- సీతమ్మధార రైతుబజార్‌లో నాసిరకం సరకు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వినియోగదారులు
- పట్టించుకోని ఎస్టేట్ ఆఫీసర్

సీతమ్మధార: రాష్ట్ర ప్రభుత్వం రైతుబజార్లలో అందజేస్తున్న టమాటా నాసిరకంగా ఉంటోందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంత కాలంగా టమాటా ధరలు పెరగడం తెలిసిందే. చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి వచ్చే టమాటాలను విశాఖలో విక్రయిస్తుంటారు. ధరల నియంత్రణలో భాగంగా మార్కెటింగ్ శాఖ ద్వారా ప్రభుత్వం లాభం, నష్టం లేనివిధంగా చిత్తూరు జిల్లా నుంచి టమాటాలను తీసుకొచ్చి రైతుబజార్లలో ఈ నెల 19వ తేదీ నుంచి కిలో రూ.58 చొప్పున సబ్సిడీపై విక్రయిస్తున్నారు. ఈ ధర శనివారం, ఆదివారం రూ.56కు తగ్గింది. ఈ నేపథ్యంలో ఆదివారం సీతమ్మధార రైతుబజార్‌కు వచ్చిన టమాటా సరకు నాసిరకంగా ఉందని వినియోగదారులు ఆందోళనకు దిగారు. టమాటా మీడియం, చిన్నసైజులో మాత్రమే ఉన్నాయని వారు తెలిపారు. ఈ నాసిరకం టమాటా మాకొద్దు బాబోయ్ అంటూ మండిపడ్డారు. హోల్‌సేల్ మార్కెట్‌లో కూడా ఇంచుమించు ఇదే ధరకు టమాటా లభిస్తోందని చెబుతున్నారు. ఇక బహిరంగ మార్కెట్‌లో టమాటా కిలో రూ.50కి లభిస్తుంది. ధర కేవలం రూ.4 మాత్రమే తేడా ఉండటం, రైతుబజార్లలో టమాటా నాసిరకంగా ఉన్న కారణంగా వినియోగదారులు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలుకే మొగ్గు చూపుతున్నారు.

పట్టించుకునే వారేరి..?

టమాటాలు బాగోలేదంటూ సీతమ్మధార రైతుబజార్‌లో వినియోగదారులు ఆందోళన దిగినా.. పట్టించుకునే నాథుడే కనిపించలేదు. రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్(ఈవో)తో సహా ఎవరూ తమను పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. టమాటా ధరలు ఎప్పుడు అదుపులోకి వస్తాయోనని వినియోగదారులు కోటికళ్లతో ఎదురుచూస్తున్నారు. దేశవాళీ పంట అందుబాటులోకి వస్తే టమాటా ధరలు గణనీయంగా తగ్గుతాయని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

వదలని వాన

మురళీనగర్: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఆదివారం కూడా కొనసాగాయి. శనివారం మధ్యాహ్నం నాటికి కాస్త తెరిపినిచ్చి గిరిప్రదక్షిణ భక్తులకు సహకరించిన వరుణుడు ఆదివారం ఉదయం మళ్లీ తన ప్రతాపం చూపాడు. ఉదయం నుంచి వర్షం అడపా దడపా పడుతూనే ఉంది. దీంతో మార్కెట్ పనులకు వెళ్లాల్సిన ప్రజలు వర్షానికి నానా అవస్థలు పడ్డారు. మురళీనగర్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డులో వర్షం నీటి తాకిడి కొనసాగింది. ముఖ్యంగా బిర్లా కూడలి నుంచి సత్యానగర్ వరకు రహదారిపై వర్షపు నీటితోపాటు మురుగు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బొత్సా స్క్వేర్ సమీపంలోని వర్మా కాంప్లెక్స్‌కు వెళ్లే రహదారి వద్ద దిగువన నిత్యం నీరు నిలిచిపోవడం సర్వసాధారణంగా మారగా.. శానిటరీ సిబ్బంది పట్టించుకోలేదు. నీటి ప్రవాహం కాలువలోకి కలిసే మార్గం మూసుకుపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీనిపై అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


బొత్సా స్క్వేర్ సమీపంలోని సర్వీస్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కూలిన ఇంటి శ్లాబ్

కుటుంబానికి తప్పిన ప్రమాదం

కంచరపాలెం: ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాల ధాటికి ఓ ఇంటి శ్లాబ్ నానిపోయి నిద్రిస్తున్న ఓ కుటుంబంపై కూలిపోయింది. ఈ ఘటన 47వ వార్డు కప్పరాడ కొండ సమీపంలోని అరుధంతినగర్‌లో దేవి, భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్న ఇంట్లో జరిగింది. వర్షాల కారణంగా శ్లాబ్ పైకప్పు నానిపోయి, ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌తో సహా శనివారం రాత్రి మంచంపై నిద్రిస్తున్న పిల్లలపై ఒక్కసారిగా పడిపోయింది. అదృష్టవశాత్తు వారంతా తప్పించుకుని స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో ఇద్దరి పిల్లల కాళ్లు, చేతులకు స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు అక్కడికి చేరుకుని, సంబంధిత అధికారులకు తెలియజేశారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందేలా ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు దృష్టికి తీసుకు వెళ్తామని వారు హామీ ఇచ్చారు.


ఇంట్లో పరిశీలిస్తున్న స్థానిక నాయకులు

క్లుప్తంగా

కల్వర్టు ఇలా... రాకపోకలెలా?


నక్కవానిపాలెంలో ప్రమాదకరంగా కల్వర్టు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం వివేకానంద కల్యాణ మండపం వద్ద కాలువపై గల కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. కల్వర్టు విరిగి ప్రమాదకరంగా మారినా.. పట్టించుకోవడం లేదని స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కల్యాణ మండపాన్ని ఆనుకుని ఉన్న కాలువ మీద గల కల్వర్టు కొంతకాలంగా శిథిలావస్థకు చేరుకుని పడిపోయేలా దర్శనమిస్తోంది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు కల్వర్టు బాగా దెబ్బతిని ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు హడలిపోతున్నారు. కల్యాణ మండపం ఆవరణలో శుభకార్యాలు, అన్నసంతర్పణ కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఈ కల్వర్టు మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. కల్వర్టు దిమ్మకు, దిమ్మకు మధ్య ఖాళీ ఉండటంతో మహిళలు, పిల్లలు ఎప్పుడు ఏ ప్రమాదానికి గురవుతారోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు కాలువ పొంగినపుడు కూడా ఈ మార్గంలో రాకపోకలు ప్రమాదభరితంగా ఉంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. సకాలంలో మరమ్మతులు చేయనందునే కల్వర్టుకు ఈ దుస్థితి దాపురించిందని అంటున్నారు. జీవీఎంసీ జోన్-3 ఇంజినీర్లు స్పందించి వెంటనే కల్వర్టును బాగుచేయాలని కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

గోపాలపట్నం: ఎన్ఏడీ జాతీయ రహదారి బస్‌స్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా.. సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయసు గల వ్యక్తి శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎయిర్‌పోర్టు పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఈ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ వ్యక్తిని గుర్తించినట్లయితే ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆటో దిగుతుండగా ప్రమాదం.. వ్యక్తికి గాయాలు


కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి

ఆరిలోవ: ఆటో దిగుతూ ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కిందపడి గాయపడ్డాడు. ప్రస్తుతం అతడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా.. జాతీయ రహదారిపై పాత డెయిరీ ఫారం కూడలి వద్ద ఓ వ్యక్తి ఎండాడ వైపు వెళ్లే ఆటో ఎక్కాడు. అతడు ఎండాడ కూడలిలో దిగాల్సి ఉంది. ఆ జంక్షన్ ముందు సిగ్నల్ పడే సమయంలో ఆటో పూర్తిగా ఆగక ముందే కిందకు దిగే ప్రయత్నం చేస్తూ అదుపు తప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి స్వల్ప గాయాలై స్పృహ కోల్పోయాడు. స్థానికుల సహాయంతో ట్రాఫిక్ పోలీసులు అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ అతడికి వైద్యం అందిస్తున్నారు. స్పృహ రాలేదు. తల లోపల భాగంలో తీవ్ర గాయాలు తగిలి ఉంటాయని వైద్యులు భావిస్తున్నారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తికి ప్రమాదంగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బంధువులు ఎవరైనా ఉంటే ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

మద్దిలపాలెం: పర్యావరణ పరిరక్షణతో మానవ మనుగడ సాధ్యమని మద్దిలపాలెం గ్రామ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బోస ఎర్రయ్య అన్నారు. ఆదివారం మద్దిలపాలెం సీఎంఆర్ శ్మశానవాటికలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీను


కంచరపాలెం పీఎస్‌లో రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఏఎస్ఐ ఆదిరాజు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి నేరాలు చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలన్నారు. ఎటువంటి గొడవల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీరు చేసే పనులపై పోలీస్ నిఘా ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు ఎస్ఐ సూచించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులకు పోలీస్ సిబ్బంది అప్పగించారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

మర్రిపాలెం: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని కంచరపాలెం ఐదో పట్టణ ఏఎస్ఐ ఆదిరాజు సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎటువంటి నేరాలకు పాల్పడకూడదని, గొడవల్లో తలదూర్చకూడదన్నారు. నేరాల జోలికి వెళ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎల్లప్పుడూ రౌడీషీటర్లపై పోలీస్ నిఘా ఉంటుందని, బుద్ధిగా నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంలోనూ సాగిన భక్తజనం

గోపాలపట్నం: గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు ఆదివారం వర్షం ఇబ్బంది కలిగించినా ఆగలేదు. గొడుగులు వేసుకుని కొందరు, తడుస్తూనే మరి కొందరు భక్తులు అప్పన్న చెంతకు చేరారు. చిన్న పిల్లలను భుజాలపై మోసుకుంటూ తల్లిదండ్రులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు.

అర్ధరాత్రి దాటినా సేవా కార్యక్రమాలు

భక్తులకు సేవలందించడమూ పుణ్యమే అనే భావనతో పలువురు, పలు సంస్థలు సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా భక్తులకు తినుబండారాలు, దాహార్తి తీర్చే పానీయాలు అందించారు. బాజీ జంక్షన్ వంశీ సూపర్ మార్కెట్ వద్ద ఆటో అసోసియేషన్ సభ్యులు మాత్రం రాత్రాంతా పండ్లు, టీలు, మంచినీరు, టిఫిన్లు గిరిప్రదక్షిణ చేసిన భక్తులకు పంపిణీ చేశారు. ఆదివారం ఉదయం కూడా వేడి వేడి ఇడ్లీ అందించి భక్తుల ఆకలి తీర్చారు.


గొడుగులు వేసుకుని గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

పాఠశాల అభివృద్ధికి కార్యాచరణ


సమావేశంలో పాల్గొన్న గోపాలపట్నం జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం తొలి సమావేశం ఆదివారం నిర్వహించారు. 1963 నుంచి 2024 వరకు చదువుకున్న విద్యార్థులు ఇటీవల సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆ కార్యవర్గం సమావేశమై భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. పూర్వ విద్యార్థులను సమీకరించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. మరో సమావేశం నిర్వహించి అందరి సభ్యుల ఆలోచనలను సమీకరించి నిర్ణయాలు తీసుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మజ్జూరి శ్రీనివాస్, కార్యదర్శి వైఎస్ ప్రసాద్, సహాయ కోశాధికారి కోనేటి సత్తిబాబు, ఉపాధ్యక్షుడు మేడిది రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దైవం ఇచ్చిన వరమే సంగీతం

బీచ్ రోడ్డు: మనసును రంజింప చేసేది రాగమని, దైవం ఇచ్చిన వరమే సంగీతమని సంగీత విద్వాంసుడు పంతుల గోపాలరావు అన్నారు. గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా ఆదివారం రాంనగర్ రాఘవేంద్ర స్వామి మఠం సమావేశం మందిరంలో ఐ.వి.ఎల్.శాస్త్రి సంగీత సమితి ఉచిత సంగీత శిక్షణాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంగీతం, భక్తి రెండు కలిసి సాగాలని, గురువు వద్ద భక్తితో ఉండటం, జ్ఞానాన్ని పొందడం ఎంతో అవసరమన్నారు. విద్యార్థికి ఏ విధంగా జ్ఞానాన్ని అందించాలనేది గురువుకు అవగాహన ఉంటుందన్నారు. విభిన్న స్థాయిల్లో ఉన్న విద్యార్థులకు అనుగుణంగా గురువు బోధన చేసి వారికి అవగాహన కల్పిస్తారని చెప్పారు. నిత్యం సాధన చేస్తూ ఉంటే విద్యలో పరిణితి సాధించడం వీలవుతుందన్నారు. సంస్థ అధ్యక్షుడు ఆకొండి వెంకటరావు స్వయంగా పంతుల గోపాలరావుకు పాద పూజ నిర్వహించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి జగన్మోహనరావు, కోశాధికారి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంగీత విద్వాంసుడు పంతుల గోపాలరావు

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

- భక్తులతో పోటెత్తిన షిర్డీసాయి మందిరాలు
- ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదానాలు


సీతంపేట శ్రీకంఠ గురుదత్త సాయి మందిరంలో బాబాకు లక్ష గులాబీలతో అర్చన


నార్త్ ఎక్స్‌టెన్షన్ ఆలయంలో షిర్డీసాయిబాబాకు అన్నాభిషేకం


మురళీనగర్‌లో షిర్డీసాయికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు


నగర క్రైం డీసీపీ వెంకటరత్నంను సత్కరిస్తున్న రామాలయ కమిటీ సభ్యులు

సీతంపేట: నియోజకవర్గంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి షిర్డీసాయి మందిరాలు భక్తులతో పోటెత్తాయి. ప్రత్యేక పూజలు, అన్నాభిషేకాలు, అన్నప్రసాద వితరణలు చేపట్టారు.

- అక్కయ్యపాలెం లలితానగర్ శ్రీలలితా పీఠంలో వ్యవస్థాపక పీఠాధిపతి దక్షిణామూర్తి పరమహంస, ద్వితీయ పీఠాధిపతి అవ్యక్తానంద మహరాజ్‌లకు విశేష అభిషేకం, అర్చన జరిపించారు. షిర్డీసాయికి క్షీరాభిషేకం, అర్చన, ప్రత్యేక అలంకరణ చేశారు. మధ్యాహ్నం అన్నదానం జరిపారు. లలితాదేవి సన్నిధిలో నవావరణ అర్చన, మణిద్వీపంలో నవావరణ అర్చన చేశారు. పీఠం దర్బారు హాల్లో దత్తాత్రేయ మూలమంత్ర హోమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.
- సీతంపేట శ్రీకంఠ గురుదత్త సాయి మందిరంలో పండితులు పవిత్ర నదీజలాలు, పంచామృతాలు, ఫలరసాలు, సుగంధ ద్రవ్యోదకాలతో సాయినాథుడిని అభిషేకించారు. మధ్యాహ్నం అన్నదానం జరిపారు. అన్నాభిషేకం, లక్ష గులాబీలతో సాయికి అర్చన చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలతో సాయినాథుడి రథయాత్ర నిర్వహించారు.
- అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద షిర్డీసాయి ధ్యాన మందిరంలో బాబాకు మంగళస్నానం, క్షీర, జలాభిషేకాలు నిర్వహించారు. దివ్యశోభాలంకరణలో సాయిబాబా భక్తులకు దర్శనమిచ్చారు.
- అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్‌లోని షిర్డీసాయిబాబా సంక్షేమ సేవా సంఘం ఆలయంలో పంచామృతాభిషేకం, నూతన వస్త్ర అలంకరణ, స్వర్ణ కిరీట ధారణతో బాబా భక్తులకు దర్శనమిచ్చారు. సాయినాథుడినికి అన్నాభిషేకం చేశారు.
- శ్రీనివాసనగర్ షిర్డీసాయి ప్రశాంతి నిలయంలో పంచామృతాభిషేకం, అన్నాభిషేకం జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం సాయిబాబా చావిడి ఉత్సవం నిర్వహించారు.

300 కిలోల బియ్యంతో సాయినాథుడికి అన్నాభిషేకం

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం 4 గంటలకు 300 కిలోల బియ్యంతో బాబాకు అన్నాభిషేకం చేశారు. ఉదయం సాయిబాబాను ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీషా దంపతులు బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో శేఖర్‌బాబు, సిబ్బంది వనజాక్షి, శివ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- 24వ వార్డు రేసపువానిపాలెం షణ్ముక దత్తసాయి ఆలయంలో బాబాకు భక్తులు స్వహస్తాలతో అన్నాభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం తిరువీధి ఊరేగింపు నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడు బేరి గురుమూర్తిరెడ్డి, కార్యదర్శి అప్పలస్వామిరెడ్డి జీరి, కోశాధికారి గాలి శివకుమార్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మజ్జి సత్యనారాయణరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ మజ్జి ఉమా మహేశ్వరరెడ్డి, రేసపు కుర్మారెడ్డి, బోదిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.
- నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నసంతర్పణ చేపట్టారు. అర్చకులు రామారావు శర్మ, మహేష్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

మురళీనగర్: మురళీనగర్ రామాలయ ప్రాంగణంలోని షిర్డీసాయి ధ్యాన మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శైవాగమ పండితుడు అయిలూరి శ్రీనివాసదీక్షితులు పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు అయిలూరి రామశాస్త్రి ఆధ్వర్యంలో గురు పూజా మహోత్సవాలు నిర్వహించారు. షిర్డీసాయిని విశేషంగా అలంకరించి భక్తులకు ప్రత్యేక దర్శనాలు కల్పించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, అష్టోత్తర పూజలు, మధ్యాహ్న హారతి నిర్వహించారు. జిల్లాలోని పురాతన రామాలయాల్లో ప్రధానార్చకులుగా పనిచేస్తున్న 56 మందికి గురుపూజ చేశారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, విశాఖ సిటీ క్రైం డీసీపీ వెంకటరత్నం షిర్డీసాయిని దర్శించుకుని పూజలు చేశారు. ఎమ్మెల్యే, డీసీపీలను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కార్యదర్శి టి.నారాయణరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం

అయోధ్యలో శ్రీరాముడి విగ్రహం ఏర్పాటు చేసిన సందర్భంగా ఆదివారం సాయంత్రం సీతారాముల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం సాయికి పల్లకీ సేవ, విభూది అర్చన, గోపూజ, సంధ్యా హారతి సమర్పించారు. 6.30 గంటలకు సీతారాముల ఉత్సవ విగ్రహాలకు ఆరవిల్లి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని సంప్రదాయ రీతిలో నిర్వహించారు. వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకుడు గోపీ నంబాళ్ల శేషస్వామి పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల స్వహస్తాలతో వెయ్యి లీటర్ల పాలతో అభిషేకం చేశారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి శేజ్ హారతి వరకు వచ్చిన భక్తులందరికీ అన్నప్రసాదం అందించారు. సుమారు 8 వేల మంది మహా అన్నదానంలో పాల్గొన్నారు. సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు అర్ధ ఏకాహం(భజన), రాత్రి 7 గంటలకు బాబా పల్లకి సేవ నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పల్లకీ మోశారు. రాత్రి పూజల అనంతరం షిర్డీ నుంచి తెచ్చిన విభూది, కంకణాలు, కాశీ, హరిద్వారల నుంచి తీసుకొచ్చిన పంచముఖ రుద్రాక్షలను భక్తులందరికీ పంపిణీ చేశారు. ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు ప్రత్యేక కార్యక్రమాలను పర్యవేక్షించారు.


లలితా పీఠంలో దత్తాత్రేయ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు


రేసపువానిపాలెంలో అన్నదానం చేస్తున్న గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు


రైల్వే న్యూకాలనీ ధ్యాన మందిరంలో షిర్డీసాయికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

సెయిల్‌లో విలీనానికి ఎంపీలు గళం విప్పాలి

అగనంపూడి: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం కోసం రాష్ట్రానికి చెందిన ఎంపీలు కేంద్ర ప్రభుత్వం వద్ద గళం విప్పాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు విల్లా రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో ఆదివారం కొనసాగిన 1,456వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక, మాంగనీస్ గనులకు అనుమతులు మంజూరు చేసిన క్రమంలోనే ఎంపీలు కూడా కేంద్రం వద్ద పట్టుబట్టి విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉక్కు ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, పరిరక్షణ కమిటీ నాయకులు దాసరి శ్రీనివాస్, గుమ్మడి నరేంద్ర, ఎస్.సత్యనారాయణ, బి.తవుడన్న, సూర్యం, శ్రీనివాసరావు, వేణుగోపాలరావు, నాయక్, గోపయ్య తదతరులు పాల్గొన్నారు.


దీక్ష శిబిరంలో పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు